ఆటోనగర్ హుళక్కే

- అప్పటి ఐదేళ్ల పాలనలో పట్టించుకోని టీడీపీ
- ఎన్నికలకు ముందు హడావుడిగా మాజీ ఎమ్మెల్యే బొల్లినేని శంకుస్థాపన
- అడవిని తలపిస్తున్న ఆటోనగర్ స్థలం

తెలుగుదేశం.. దూప్ శంకుస్థాపనల పార్టీగా చరిత్రలో నిలిచిపోతోంది. అధికారంలో ఉన్నన్నాళ్లు పట్టించుకోరు. ఎన్నికలకు ముందు కనీసం ప్రతిపాదనలు, అనుమతులు లేకుండానే హడావుడి శంకుస్థాపనలు చేయడం ఆ పార్టీ అధినేత నేత నుంచి స్థానిక నేతలకు అలవాలమైన విద్య. ఆయా పనులు అధికారంలోకి వచ్చిన మరో పార్టీ చేస్తే తామే దానికి కర్త, కర్మ, క్రియ అని తమ ఖాతాలో వేసుకోవడం పరిపాటే. అందులో ఒకటి ఆత్మకూరు ఆటోనగర్.



పట్టణంలోని బీఎస్సార్ సెంటర్ హిల్ రోడ్డులో ఇబ్బందులతో కొనసాగుతున్న ఆటో దుకాణాలు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ కేంద్రంగా, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, మున్సిపాలిటీ హోదాలను కలిగి ఉంది. అయితే పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా జనాభా పెరుగుతోంది. వ్యాపారాలు పెరిగాయి. అప్పట్లో బీఎస్సార్ సెంటర్ హిల్ రోడ్డు కొద్దిపాటి మెకానిక్ షెడ్లు ఉండేవి. క్రమేణ పెరిగిన జనాభాకు తగినట్లుగా ప్రస్తుతం సుమారు 60కిపైగా వివిధ రకాల ఆటోమొబైల్ దుకాణాలు వెలిశాయి. దీంతో ఆ ప్రాంతంలో రద్దీ పెరిగింది. ఆర్డీఓ, ఎంపీడీఓ, ఎంఈఓ, పంచాయతీ రాజ్, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సెబ్ కార్యాలయం తదితర పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే. ప్రత్యేకించి ఆటోమొబైల్స్ దుకాణాలకు సముదాయాలు లేకపోవడంతోనే రోడ్డునే పక్కనే ఆటో మెకానికల్ దుకాణదారులు వారి వస్తువులను పెట్టుకొని పనులు చేసుకుంటున్న పరిస్థితి. దీంతో రోడ్డు కుంచించుకుపోవడంతో పాటు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రజాప్రతినిధులు ఎవరైనా ఆ మార్గంలో వెళ్లాలంటే ముందస్తుగా పోలీసు సిబ్బంది ఆ మార్గాన్ని క్లియర్ చేసి దారి ఏర్పడేలా పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు సైతం ఇబ్బందులు పడుతూ ఈ మార్గంలో రాకపోకలు సాగించడం అలవాటైంది. ఈ విషయమై అప్పటి తెలుగుదేశం ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేకపోయింది. అప్పటి ఎమ్మెల్యే (2014–2019) మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రతిపక్ష ఎమ్మెల్యే కావడంతో టీడీపీ ప్రభుత్వం సైతం ఆటోనగర్ ఏర్పాటు చేయాలంటూ ఆయన ఇచ్చిన అర్జీలను బుట్టదాఖలు చేసింది.



అప్పట్లో ఆటోనగర్‌కు ఎంపిక చేసి శంకుస్థాపన స్థలం ఇదే

ఉత్తుత్తి హామీలే

అప్పట్లో టీడీపీకి గూటూరు కన్నబాబు, ఆనం రామనారాయణ రెడ్డి ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తూ ఆటోనగర్ ఏర్పాటు చేస్తామని ఉత్తుత్తి హామీలు ఇచ్చారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఆటోనగర్ ఏర్పాటు చేయాలంటూ యూనియన్‌గా ఏర్పడి పలువురు మెకానిక్‌లు, ఆటోమొబైల్ దుకాణాదారులు అప్పటి ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యను ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేశారు. దీంతో ఆయన 2018 అక్టోబరులో హడావుడిగా ఆటోనగర్ ఏర్పాటు చేస్తున్నామంటూ మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ వద్ద నెల్లూరు–ముంబయి రహదారి పక్కనే సర్వే నంబర్లు 90, 90/1, 90/2ల్లో సుమారు 4.80 ఎకరాల భూమిని కేటాయించారు. అనంతరం వారం రోజుల వ్యవధిలో హంగామాగా ఆటోనగర్ ఏర్పాటు కోసం శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. కేవలం ఎన్నికల స్టంట్‌గానే అప్పట్లో పలువురు విమర్శించారు. కానీ అధికారికంగా స్థలాన్ని కేటాయించలేదు. ఆటోనగర్ ప్రాంతంగా అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన చేయలేదు. గతంలో మెకానిక్ షెడ్లు నిర్వహిస్తున్న బీఎస్సార్ సెంటర్ ప్రాంతంలోనే స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆటోనగర్‌కు స్థలం కేటాయించి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మెకానిక్‌లకు స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. అయినా అది కార్యరూపం దాల్చలేదు.

ఇప్పటి వరకు స్థలాలే కేటాయించలేదు



ఆటోనగర్ ఏర్పాటు చేస్తున్నామంటూ మరో ఆరు నెలల్లో ఎన్నికలు ఉన్న తరుణంలో ఎంపిక చేసిన స్థలంలో ఆటోనగర్ ప్రారంభించనున్నట్లు అప్పట్లో నానా హంగామా చేశారు. కేవలం ఎన్నికల ముందు నమ్మించేందుకు అలా చేశారు. దాని అతీగతీ పట్టించుకోలేదు. ఇప్పటి వరకు స్థలాలే కేటాయించలేదు. ట్రాఫిక్ ఇబ్బందులు పడుతూ చిన్న గదుల్లోనే మెకానిక్ షెడ్లు నిర్వహించుకుంటున్నాం.

– షేక్ జమీర్, మెకానిక్, ఆత్మకూరు

రాష్ట్రంలో జనరంజక పాలన

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి



జగనన్న సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలి: రాష్ట్రంలో అన్ని వర్గాల పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం దగదర్తి మండలం బోడిగుడిపాడులో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సంక్షేమ పథకాలను కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రజలకు పారదర్శంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలిచి ఆశీర్వదించాలన్నారు. ప్రతి కుటుంబానికి నవరత్నాల లబ్ధి చేకూరిందన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోచుకోలేని భావితరాల ఆస్తి విద్య

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి



చేజర్ల (సోమశిల): భావి తరాలను దృష్టిలో ఉంచుకుని వారికి దోచుకోలేని ఆస్తిగా విద్యను అందిస్తూ వారి భవితకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారు బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం అనంతసాగరం మండలం ఆమని చిరువెళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను ఆకాంక్షిస్తూ మన బడి, నాడు–నేడు అమ్మ ఒడి, విద్యా కానుక, వసతి దీవెన, విద్యాదీవెన సంక్షేమ పథకాలను సమకూరుస్తూ వారిని ప్రభుత్వ విద్య వైపు ప్రోత్సహిస్తున్నారన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పిల్లలకు రూ.2 వేల విలువ చేసే జగనన్న విద్యా కానుక కిట్లను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వింజమూరు(ఉదయగిరి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గ్రీస్ క్యాన్సర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత వైద్య, క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. రొమ్ముల్లో కణితలు, గర్భాశయ క్యాన్సర్ నోటి క్యాన్సర్‌లకు సంబంధించి పరీక్షలు నిర్వహించి చికిత్స చేస్తారు. 45 ఏళ్లు పూర్తయిన మహిళలకు గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. మామోగ్రామ్ స్క్రీనింగ్ పరీక్ష కూడా చేస్తారు. ఈ శిబిరం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుంది.

బాధ్యతగా డ్రైవింగ్ చేయండి

- ఎంవీఐ బి.రాములు



ఎంవీఐ రాములును సన్మానిస్తున్న డ్రైవర్లు

ఆత్మకూరు: పాఠశాలల వాహనాలు నడిపే డ్రైవర్లు బాధ్యతతో విధులు నిర్వహించాలని, తమ చేతిలో చిన్నారుల విలువైన ప్రాణాలు ఉన్నాయన్న విషయం గుర్తెరగాలని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.రాములు అన్నారు. డివిజన్‌లోని అన్ని మండలాల ప్రైవేట్ బస్సు డ్రైవర్లకు బుధవారం విధులపై అవగాహన, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంవీఐ రాములు మాట్లాడుతూ పాఠశాల వాహనాలను పూర్తిస్థాయి కండీషన్‌లో ఉంచుకోవాలన్నారు. ఎలాంటి మరమ్మతులు ఎదురైనా వెంటనే యాజమాన్యానికి తెలిపి రిపేర్లు చేయించాలన్నారు. మత్తు పానియాలు తాగి వాహనాలు నడపరాదని అన్నారు. సెల్‌ఫోన్ సైతం వాహనం నడిపే సమయంలో ఉపయోగించకూడదన్నారు. అధిక లోడ్‌తో పాఠశాల బస్సులు ప్రయాణిస్తే కేసులు బుక్ చేయక తప్పదన్నారు. ఎంవీఐని డ్రైవర్లు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల నిర్వాహకులు, టి వెంకట సుబ్బయ్య, జి సురేష్‌బాబు, ఎస్ రామ్మోహన్‌రెడ్డి, చైతన్య భాస్కర్‌రెడ్డి, అన్ని ప్రైవేట్ పాఠశాలల వాహనాల డ్రైవర్లు, పాల్గొన్నారు.

అన్యాయం జరిగితే ఆందోళన

- నష్టపరిహారం చెల్లింపు న్యాయబద్ధంగా ఉండాలి
- గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితుల డిమాండ్
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



హైవే నిర్మాణంలో భాగంగా పబ్బులేటిపల్లిలో కోల్పోతున్న భూములు

సీతారామపురం: సీతారామపురం మండలం మీదుగా నిర్మిస్తున్న బెంగళూరు–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు అన్యాయం జరిగితే ఆందోళన తప్పదని యజమానులు హెచ్చరిస్తున్నారు. ఆర్నెళ్ల క్రితం జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారి పట్టాదారు పాస్‌పుస్తకాలు, వివరాలను సేకరించి నష్టపరిహారం చెల్లించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఈ భూములకు సంబంధించి నష్టపరిహారం వివరాలు అధికారులు సక్రమంగా నమోదు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపరిహారం చెల్లింపు విషయంలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీతారామపురం మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డితో కలిసి బాధితులు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం అందించారు. నష్టపరిహారం చెల్లింపు విషయంలో అధికారులు ఒక్కొక్కరికి ఒక్కో రకంగా వివరాలు నమోదు చేసి పక్షపాత వైఖరి చూపిస్తున్నారన్నారు. ఎకరాకు రూ.7–8 లక్షల వరకు నష్టపరిహారం అందించాల్సి ఉన్నా కేవలం రూ.3–4 లక్షల వరకే చెల్లింపులు జరిపేందుకు సిద్ధమయ్యారన్నారు. గ్రామంలో 45 మంది బాధితులు దాదాపు 20 ఎకరాల వరకు భూములు కోల్పోతున్నారన్నారు. తమకు తగిన న్యాయం జరగకపోతే గ్రామమంతా ఏకమై హైవే నిర్మాణ పనులు నిలిపివేస్తామన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, మాజీ సర్పంచ్

న్యాయం జరగకపోతే హైవే పనులు నిలిపివేస్తాం



హైవే నిర్మాణం కోసం మా భూములు కోల్పోతున్నాం. అధికారులు మాకు తగిన నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవడం లేదు. నష్టపరిహారం విషయంలో మాకు అన్యాయం జరిగితే హైవే పనులు జరగకుండా అడ్డుకుంటాం.

– పోరుమామిళ్ల యానాదమ్మ, పబ్బులేటిపల్లి

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి



గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. ఈ విషయమై కలెక్టర్ హరినారాయణన్‌ను కలిసి విన్నవించాం. ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

– మద్దినేని శ్రీనివాసులు, మాజీ సర్పంచ్, పబ్బులేటిపల్లి

క్లుప్తంగా

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈఓకు నగదు అందిస్తున్న దృశ్యం

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఇరిగినేని అంజయ్యనాయుడు కుటుంబ సభ్యులు బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ ఈఓ ఎట్టిగుంట ఉషశ్రీకి విరాళం మొత్తాన్ని అందజేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించండి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

వరికుంటపాడు: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలందించాలని కందుకూరు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద సూచించారు. ఆమె బుధవారం వరికుంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. ఆమె మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. వైద్యశాలలో కాన్పులు, ఓపీ శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు కరిష్మా, సీహెచ్‌ఓ రాజశేఖర రాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజరు రియాజ్, స్టాఫ్‌నర్సు రోజారమణి ఉన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సన్మానం



కావలి: స్వచ్ఛంద పదవి విరమణ చేసిన కావలి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.సుబ్బారావు దంపతులను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. కావలి ప్రజానీకానికి ఆయన అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్, సెక్రటరీ పి శ్రీధర్, సలహాదారులు రవికుమార్, మహిళా విభాగం ప్రెసిడెంట్ ఉషారాణి, సభ్యులు నలినీ పద్మ, ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయ వేసవి శిక్షణా శిబిరం ముగింపు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడులోని శాఖా గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరాలు బుధవారం ముగిశాయి. మండల వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, స్థానిక సర్పంచ్ షేక్ బీబీజాన్ ముఖ్య అతిథులుగా హాజరై వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. గ్రంథాలయ అధికారి నారాయణరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంగమాంబ సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నేతలు



అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

ఉదయగిరి: మండలంలోని నర్రవాడ వెంగమాంబ అమ్మవారిని బుధవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు దర్శించుకున్నారు. సీతారామపురం మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, దుత్తలూరు ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి, కమ్మవారిపాళెం సొసైటీ అధ్యక్షుడు చేజర్ల చలమారెడ్డి, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, అల్లూరురాజు, తదితరులు ఉన్నారు.

రక్తదాతలు మానవతకు ప్రతి రూపాలు



కార్ల్ ల్యాండ్ స్టినేర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

కావలి: రక్తదాతలు మానవత్వానికి ప్రతి రూపాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక క్రిస్టియన్‌పేటలోని లైఫ్‌కేర్ ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె బ్లడ్ గ్రూప్‌ల నిర్ధారణ శాస్త్రవేత్త కార్ల్ ల్యాండ్ స్టినేర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం రాష్ట్రస్థాయిలో వరుసగా ఆరు సార్లు ప్రథమ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. లైఫ్‌కేర్ ఆస్పత్రి యజమాని, లింగసముద్రం జెడ్పీటీసీ డాక్టర్ నళినిపద్మ పాల్గొన్నారు.

సంక్షేమాన్ని కళ్లారా చూసి నోట మాటల్లేవ్

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల(సోమశిల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమ కోసం అందజేస్తున్న పథకాలను చూసి పాదయాత్ర చేస్తున్న లోకేశ్ సైతం ఏమీ మాట్లాడలేక పోతున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, పక్క రాష్ట్రాల పథకాలను కాపీ కొట్టి టీడీపీ ఫేజ్–1 మేనిఫెస్టో చేశారని ఎద్దేవా చేశారు. బుధవారం అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్ల సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ప్రజలతో మాట్లాడారు. జగనన్నకు ఏమి చెప్పమంటారని వారిని ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్లుగా మన ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి జగనన్నపై విమర్శలు చేస్తున్న లోకేశ్ ఇప్పుడు ప్రజల్లోకి రావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై పూర్తిగా అవగాహన వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న ససంక్షేమ పథకాలు మంచివని చెప్పలేక టీడీపీ సైతం తమ మేనిఫెస్టోలో పెట్టిందంటే మన జగనన్న సంక్షేమ పథకాలు మంచివనే కదా అర్థమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ అన్ని సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. రెవెన్యూ, హౌసింగ్ సమస్యలు త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నియోజకవర్గంలో 17 వేల చుక్కల భూముల సమస్యలు పరిష్కరించారన్నారు. భూమిలేని నిరుపేదలకు భూపంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ అంకిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కేతా రామకృష్ణారెడ్డి, బిజివేముల ఓబుల్‌రెడ్డి, ఆమని చిరువెళ్ల సర్పంచ్ ఎస్.లక్ష్మమ్మ, ఎంపీటీసీ సుబ్బమ్మ, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి, అనంతసాగరం సర్పంచ్ శోభ, ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, సుబ్బారావు, శ్రీరామ్, శేషయ్య, ఎస్‌కే రసూల్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



నువ్వూరుపాడు రెవెన్యూ సదస్సులో రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు

ఆత్మకూరురూరల్: దశాబ్దాలుగా పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలకు ప్రభుత్వం నూతనంగా జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆత్మకూరు తహసీల్దారు లక్ష్మీనరసింహం తెలిపారు. మండలంలోని నువ్వూరుపాడు, జంగాలపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ చుక్కల భూముల సమస్య వల్ల వందలాది రైతులు గతంలో పడుతున్న ఇబ్బందులు, ఒక్క జీఓ జారీ చేయడం ద్వారా ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. రెవెన్యూ రికార్డుల్లో చుక్కల భూములుగా ఉన్న రైతుల అనుభవంలోని పొలాలను రెవెన్యూ అధికారులే క్రమబద్ధీకరణ చేస్తారని రైతులకు ఈ విషయంలో శాశ్వత ఉపశమనం లభిస్తుందన్నారు. వారసత్వం, పాతి కేసులు నిర్దిష్టమైన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే ఆయా సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పృథ్వీకుమార్, వీఆర్‌ఓ మాల్యాద్రి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం శ్రీనివాసులురెడ్డి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

హవ్వా! ఆనం.. పార్టీలు మారుతూ విమర్శలా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనుమసముద్రంపేట: పదవుల కోసం పార్టీలు మారుతూ గెలిచిన పార్టీపైనే విమర్శలు చేయడం ఆనం రామనారాయణరెడ్డికి అలవాటు అయిందని ఏఎస్‌పేట వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. బుధవారం ఏఎస్‌పేటలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. మంత్రి పదవి రాలేదన్న అక్కసుతో పార్టీలు మారుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని విమర్శించారు. పదవుల కోసం పాకులాడే ఆనం రామనారాయణరెడ్డికి అభివృద్ధి గురించి ఏం తెలుసునన్నారు. ఆనంకు నైతిక విలువలు ఉంటే ఎమ్మెల్యే పదవికి తక్షణం రాజీనామా చేయాలన్నారు. ప్రభుత్వ పాలన దుర్మార్గమని చెప్పడం ఎంత వరకు సమంజసమో ఆయన తెలిపాలన్నారు. నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యేగా ఉంటున్న మీకు అభివృద్ధి కనిపించలేదా అని ప్రశ్నించారు. టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో ఉత్తరకాలువ అభివృద్ధిని ఎందుకు విస్మరించారని నిలదీశారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి మంత్రి అయిన వెంటనే ఉత్తరకాలువ ఆధునికీకరించడంతో రైతులు సుభిక్షంగా పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. మంత్రి పదవి కోసం ఎగబడే మీకు అభివృద్ధి ఎక్కడ కనిపిస్తుందిలే అని ఎద్దేవా చేశారు. మేకపాటి సొంత నిధులతో ఆత్మకూరును అభివృద్ధి చేశారని, ఆత్మకూరు నియోజకవర్గానికి మీ సొంత నిధులు ఖర్చు చేశారా? దాఖలాలు ఉంటే బహిరంగంగా తెలిపాలన్నారు. వైఎస్సార్‌సీపీలో దోచుకునేందుకు వీలు లేకనే పార్టీ మారుతున్నది నిజం కాదా అని వారు నిలదీశారు. 2024 ఎన్నికల్లో ప్రజలే మీకు బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ కోటిరెడ్డి, ఐ వెంకటేశ్వర్లు, జనార్దన్‌రెడ్డి, గోడా భాస్కర్‌రెడ్డి, సూరా శ్రీనివాసులరెడ్డి, ఎస్ వెంకటేశ్వర్లురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సూరం ప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో జన్‌భాగీరథ్



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆత్మకూరు: చిన్నారుల ఉజ్వల భవిష్యత్ కోసం పౌష్టికాహారం, క్రమశిక్షణ లభించే అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సాహించాలని అంగన్‌వాడీ నిర్వాహకులు ప్రదర్శన నిర్వహించారు. జన్‌భాగీరథ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని మేదరవీధి గిరిజన కాలనీ, ఏసీఎస్ఆర్‌కాలనీల్లో అంగన్‌వాడీ క్లస్టర్ కేంద్రాల్లో సీడీపీఓ జైనకుమారి, ఏసీడీపీఓ సునీలత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులు, కార్యకర్తలు, సహాయకులతో ర్యాలీ నిర్వహించారు. మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, అంగన్‌వాడీ నిర్వాహకులు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంచముఖి గణపతికి విశేష పూజలు



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లిలో కొలువైన శ్రీపంచముఖ శక్తిగణపతి స్వామివారికి భక్తులు బుధవారం విశేష పూజలు నిర్వహించారు. డీసీపల్లికి చెందిన రేవూరు జనార్దన్‌రెడ్డి, రేణుక, గోపిరెడ్డి రమణారెడ్డి, రమణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. స్వామి వారికి విశేష పుష్పాలంకరణ చేసి నైవేద్యాలు సమర్పించారు. అర్చనలు, మంగళహారతుల అనంతరం పూజారి పొశర్లపూడి వెంకటేశ్వర్లుశర్మ తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

వేడుకగా జగనన్న కాలనీలో శంకుస్థాపన



కావలి: దగదర్తి మండలం ఐతంపాడులో జగనన్న కాలనీలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని దగదర్తి ఎంపీపీ తాళ్లూరు వెంకటప్రసాద్‌నాయుడు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, స్థానిక నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.